సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు హనుమజ్జయంతి



మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో గురువారం హనుమజ్జయంతి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సింధూర పూజ నిర్వహిస్తారు. రూ.300 చెల్లించిన వారి పేరు, గోత్రనామాలతో శ్రీ స్వామి వారి పూజ నిర్వహించి లడ్డూ, పులిహోర, సింధూరం అందజేస్తామని దేవాలయ ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకృతి చికిత్సాలయంలో ఉగ్రవాద వ్యతిరేక దినం



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట: శ్రీ గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో బుధవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం జరిగింది. తొలుత రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో ఉగ్రవాదుల బెల్ట్ బాంబు దాడిలో రాజీవ్ గాంధీ అకాల మరణం పొందారని అన్నారు. దేశంలో ఐటీ రంగం అభివృద్ధికి ఆద్యుడు రాజీవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వైద్య నిపుణులు శిష్టా లక్ష్మీనారాయణ, యోగ సాధకురాలు శిష్టా శ్రీలక్ష్మి, గేదెల శ్రీహరి, రాము, రమణ, బంగారమ్మ, మరగడ గౌరీ రెడ్డి, సోమేశ్వరరావు, గొర్ల అప్పలరాజు, రీసు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధి 30వ వార్డులోని రెల్లివీధిలో రూ.71 లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాస్ భూమి పూజ చేశారు. కలెక్టర్ కార్యాలయ జంక్షన్ నుంచి రెల్లివీధి అంబేడ్కర్ కల్యాణ మండపం వరకు జీవీఎంసీ నిధులతో తారు రోడ్డు వేయనున్నారు. నగర సుందరీకరణకు కృషి చేస్తున్నట్టు మేయర్ తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సుధాకర్, స్థానిక కార్పొరేటర్ అప్పలరత్నం, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణాధికారికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: అధిక ఇంధన పొదుపు చేయడం, అత్యుత్తమంగా బస్సులు నడపడంలో జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు ప్రశంసలు అందుకున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్(ఇంజినీరింగ్, పరిపాలన విభాగాలు), ప్రాంతీయ మేనేజర్లు పాల్గొన్నారు.

భరతమైన నాట్యం.. బతుకు నిత్య నృత్యం

స్వామి వివేకానంద సంస్థ వేదికగా..

పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ వేదికగా రామకృష్ణ మిషన్, స్వామి వివేకానంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న ట్యూషన్ పిల్లలకు ఇంద్రాణి నరేంద్రరెడ్డి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉచితంగా శిక్షణ అందిస్తూ పేద పిల్లలకు నృత్యంపై మక్కువ పెంచుతున్నారు.



స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలకు నృత్యంలో శిక్షణ



కూచిపూడిలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



లండన్‌లో పిల్లలకు శిక్షణ ఇస్తున్న ఇంద్రాణి (ఫైల్)

ఔత్సాహికులకు ఉచితంగా నాట్యం నేర్పుతున్న ఇంద్రాణి నరేంద్రరెడ్డి

కళకు అంతరాలు లేవని నిరూపిస్తున్న చిన్నారులు

నాట్యంలో రాణిస్తున్న హిందూ, క్రిస్టియన్, ముస్లిం బాలికలు

డాబాగార్డెన్స్: సరిహద్దులను చెరిపేసేది కళ. అనుబంధాలను పెంచేది కళ. అందరినీ ఒకటిగా నిలిపేది కళ. మూడు మతాల అమ్మాయిలను త్రివేణీ సంగమంలా ఒకటి చేసింది ఆ కళే. కూచిపూడి నాట్యం హిందూ, క్రిస్టియన్, ముస్లిం అమ్మాయిలను అక్కున చేర్చుకుని, మీరంతా తనకు ఒకటేనని అనురాగం పంచింది. మూడు మతాలకు చెందిన అమ్మాయిలు నాట్యం నేర్చుకుని 'గిన్నిస్'గుర్తింపు పొందడం ఓ విశేషం. ఇదిలా ఉండగా ఎందరో పేద పిల్లలకు కూచిపూడి నృత్యం ఉచితంగా నేర్పుతూ.. వారిని తీర్చిదిద్దుతున్నారు నాట్యదీపిక అకాడమీ వ్యవస్థాపకురాలు నరేంద్ర ఇంద్రాణిరెడ్డి. తన దైన శైలిలో పేద పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కూచిపూడిలో ఓనమాలు దిద్దిస్తున్నారు.



నాట్య గురువు.. నరేంద్ర ఇంద్రాణి రెడ్డి..

కూచిపూడి నాట్యకోవిదురాలు ఇంద్రాణి నరేంద్ర రెడ్డి చిన్నతనం నుంచి (నాల్గవ ఏట) ప్రముఖ నాట్యాచార్యుల వద్ద నాట్యం నేర్చుకోవడం ప్రారంభించారు. ఫోర్ట్ క్యాథలిక్ గరల్స్ స్కూల్లో 2001లో తన విద్యాభ్యాసాన్ని మొదలు పెట్టి ఓ పక్క చదువు సాగిస్తూ, తన ఆరవ ప్రాణమైన నాట్యాన్ని అభ్యసించారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు. నాట్య శాస్త్రంలో కూచిపూడి విభాగంలో డబుల్ డిప్లొమో సాధించారు. నాట్యంపై మక్కువతో నాట్యదీపిక కూచిపూడి అకాడమీని ఏర్పాటు చేశారు. జాతీయ, అంతర్జాతీయ ప్రోగ్రామ్స్ చేశారు. నాట్య మయూరి, గురుశ్రేష్ఠ, నాట్యరవళి అనే బిరుదులు సొంతం చేసుకున్నారు. 2020లో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఫోరమ్స్ (ఆస్ట్రేలియా) ద్వారా విద్యారత్న అవార్డు అందుకున్నారు.



లండన్‌లో ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు పొందుతున్న ఇంద్రాణి నరేంద్రరెడ్డి (ఫైల్)

నాట్య సరస్వతి ముద్దు బిడ్డలు..

కళ అనేది దైవ సమానం. దైవానికి ఎలాంటి అంతరాలు, విభేదాలు అంటవు. మూడు విభిన్న మతాలకు చెందిన ఆ బాలికలు అలాగే కళాప్రవాహంలో పునీతులయ్యారు. నాట్య సరస్వతి ముద్దు బిడ్డలుగా మురిపాలందుకుంటున్నారు. కూచిపూడి నాట్యాన్ని పట్టుదల, చిత్తశుద్ధితో అభ్యసించి అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు.

పదేళ్ల కిందటే..

పాతనగరానికి చెందిన ఎల్. నరేంద్ర ఇంద్రాణి రెడ్డి పదేళ్ల కిందటే కూచిపూడి నృత్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు వందలాది మంది పిల్లలు అక్కడ నాట్యం నేర్చుకున్నారు. ఎంతో మంది పిల్లలు జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా బహుమతులు అందుకున్నారు. 2016లో ఇక్కడ శిక్షణ పొందిన ఏడుగురు విద్యార్థులు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించారు. వారిలో ఇద్దరు ముస్లిం పిల్లలు, ముగ్గురు హిందువులు, మరో ఇద్దరు క్రిస్టియన్ బాలికలు ఉన్నారు. అంతా కలిసి ఒక్కటిగా నాట్యం నేర్చుకుని కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఘనత సాధించారు. ఏడుగురూ సంయుక్తంగా మొత్తం 180కి పైగా ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా ఈ విశిష్టతను అందుకున్నారు. ఓ వైపు చదువుకుంటూనే, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వీరు నాట్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.



ఇంద్రాణి నరేంద్రరెడ్డి వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు

చాలా గర్వంగా ఉంది..



ఎంతో మంది పిల్లలు నా వద్ద నాట్యం నేర్చుకుంటున్నారు. నా వద్ద శిక్షణ పొందుతున్న పిల్లల్లో భిన్న మతాలకు చెందిన వారు ఉన్నారు. వారిలో ఏడుగురు పిల్లలు 180కి పైగా ప్రదర్శనలిచ్చి గిన్నిస్ రికార్డ్ సాధించడం గర్వకారణంగా ఉంది. కూచిపూడి, జానపదం, సెమీ క్లాసికల్, వెస్ట్రన్ తరహా నాట్యాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను. ఈ నాట్యం ఎప్పుడూ జ్యోతిలా వెలగాలనే ఆలోచనతో మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలన్న ఆశయంతో అకాడమీ స్థాపించాను. ప్రస్తుతం మన పిల్లలకే కాక లండన్‌లో కూడా అక్కడి పిల్లలకు కూచిపూడి నేర్పించాను. నాట్య కళాకారిణిగా, గురువుగా అనేక మంది చిన్నారులు, వాళ్ల తల్లిదండ్రుల కలలు నిజం చేసే అవకాశం నాకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. నా వెనుక నిలబడిన నా జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, గురువులకు పాదాభివందనాలు.

– ఇంద్రాణి నరేంద్ర రెడ్డి, నాట్య గురువు, నాట్యదీపిక కూచిపూడి అకాడమీ

కార్మిక సమ్మెపై ప్రభుత్వ నిర్బంధం తగదు



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

డాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై కూటమి ప్రభుత్వం నిర్బంధం ఆపాలంటూ కమ్యూనిస్టులు బుధవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహ్మాన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కులోని 3 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అమానుషంగా తొలగించిందన్నారు. మరో 2,600 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని ఆరోపించారు. వేల సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులను అర్ధంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. కార్మికుల ఉపాధిని కాపాడి, వారి కుటుంబాలను ఆదుకోవల్సిన రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు కుట్రలు కొనసాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి వత్తాసు పలకడమేనన్నారు. కూటమి పార్టీలు తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్బంధంపై ఆందోళనలు చేసి, ప్రజాస్వామ్య హక్కుల గురించి ప్రసంగాలిచ్చి, అధికారంలోకి రాగానే వాటిని మరచిపోయి నిర్బంధం ప్రయోగించడం ప్రజలు, కార్మికులను వంచించడమేనన్నారు. వేల సంఖ్యలో కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్ నోరు మెదపకపోవడం కార్మికులు, వారి కుటుంబాలకు ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో బి. జగన్, దేవసహాయం, కె. చంద్రశేఖర్, పి. మణి, మన్మథరావు, బి. ఈశ్వరమ్మ, ఎం. సుబ్బారావు, పి. పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళ

- సురక్షిత ప్రాంతానికి వర్షంలో పడి ఉన్న వ్యక్తి తరలింపు
- 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాముకు పలువురి అభినందన



వర్షపు నీరు, బురదలో పడి ఉన్న వ్యక్తి



మరో వ్యక్తి సహాయంతో బాధితుడిని తరలిస్తున్న పచ్చిరిపల్లి రాము

వర్షంలో స్పృహ లేకుండా పడి ఉన్న వ్యక్తిని చూస్తూ వదిలేయకుండా తనకు తోచిన సహాయం చేసి అందరితో శభాష్ అనిపించుకున్నారు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి అల్లిపురం సౌత్ జైలురోడ్డులో ఒక వ్యక్తి వర్షపు నీటిలో స్పృహ లేకుండా పడి ఉన్నాడు. అది గమనించి 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము స్థానికంగా గల ఒక వ్యక్తి సహాయంతో అతన్ని అక్కడి నుంచి వేరే చోటుకు తరలించి సపర్యలు చేశారు. దీంతో స్థానికులు ఆయనను అభినందించారు. అల్లిపురం

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా గంగా మహేష్



ఉత్తర్వులు అందుకుంటున్న గంగా మహేష్

డాబాగార్డెన్స్: టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ విశాఖపట్నం సభ్యుడిగా బొడ్డేటి గంగామహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం డాబాగార్డెన్స్ టెలిఫోన్ భవన్‌లో ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు చొరవతో ఆయన కోటాలో తనకు ఈ పదవి లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో అద్భుతం

- 550 గ్రాముల మిరాకిల్ బేబీ జననం



తక్కువ బరువుతో జన్మించిన శిశువుతో వైద్య సిబ్బంది

మహారాణిపేట: అతి తక్కువ బరువుతో జన్మించిన శిశువుకు మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. చాలా సంవత్సరాలుగా వంధ్యత్వం, అధిక రక్తపోటు కలిగిన తల్లికి 25 వారాల గర్భంతో ఒక బేబి జన్మించింది. 'మిరాకిల్ బేబీ' ఇప్పుడు 1.7 కిలోల బరువుతో, సాధారణ మెదడుతో ఉండడంతో డిశ్చార్జి చేశారు. లండన్ ఐవీఎఫ్ సెంటర్‌లో చాలా సంవత్సరాల వంధ్యత్వ చికిత్స తర్వాత ఈ గర్భం దాల్చింది. తల్లికి తీవ్రమైన రక్తపోటు రావడంతో అనారోగ్య సమస్య తలెత్తాయి. ఈ దంపతులను విమెన్ – చైల్డ్ జగదాంబ మెడికవర్ ఆస్పత్రిలోని చీఫ్ నియోనిటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్, నియోనిటాల్ బృందానికి రిఫర్ చేశారు. పుట్టినప్పుడు శిశువు ఊపిరితిత్తుల సమస్యకు చికిత్స అందించారు. ఆమెకు వెంటనే మెడికవర్ అధునాతన నియోనిటాల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందించారు. 15 రోజుల ఇన్వాసివ్ వెంటిలేషన్ చికిత్స తర్వాత ఇప్పుడు శిశువు ఆరోగ్యం మెరుగుపడింది. మదర్ కేర్ సంరక్షణ చర్యలను అమలు చేశామని డాక్టర్ సాయి సునీల్ కిషోర్ వివరించారు. డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీరంగ తదితర వైద్యులు సహకారం అందించారు.

అప్పలరాజు ఆశయ సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న ముజఫర్

డాబాగార్డెన్స్: కష్ట జీవుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన గుండాల అప్పలరాజు ఆశయ సాధనకు ముందుకు సాగాలని సిటు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ పిలుపునిచ్చారు. అప్పలరాజు సంస్మరణ సభ బుధవారం సిటు కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న గుండెపోటుతో అప్పలరాజు అకాల మరణం పొందారన్నారు. మోటార్, ఆటో రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి, ప్రధానంగా వెల్ఫేర్ బోర్డు కావాలని జీవో 21 రద్దు చేయాలని సమ్మె నోటీసు ముందు రోజే ఇచ్చి, రెండో రోజు ఉదయం 5 గంటలకే స్ట్రోక్ వల్ల మృతి చెందడం, కార్మికులకు తీరని లోటని పేర్కొన్నారు. పెందుర్తిలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాలతో పోరాడి స్పందించకపోతే ఈ ప్రాంతంలో పేదలను కదిలించి సీపీఎం నాయకత్వంలో ఎర్ర జెండాలు పాతించి అనేక మందికి ఇళ్లు ఇప్పించారన్నారు. నేడు మతం పేరిట బీజేపీ ప్రజలను విడగొట్టి లాభం పొందాలని చూస్తుంటే రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా బీజేపీకి వంత పాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షురాలు పి. మణి, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్, ఆర్టీసీ యూనియన్ నాయకురాలు సీత, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ శిక్షణ



శిక్షణ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లతో నేవీ అధికారులు



శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

అల్లిపురం: యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఏవీఎన్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. త్రీ ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణ శిబిరం ఈ నెల 13వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరుగుతుంది. శిక్షణలో భాగంగా క్యాడెట్లు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. బోట్ పుల్లింగ్, సిమ్యులేటర్ ద్వారా కాల్పులు, రైఫిల్ షూటింగ్, టెంట్ పిచింగ్, డ్రిల్, రైఫిల్ డ్రిల్ సీమాఫోర్ వంటి అంశాలు నేర్చుకున్నారు. సివిల్ డిఫెన్స్ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఎమర్జెన్సీ వైద్య సేవలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కాలేజీలో ఉన్న బోటనీ, జువాలజీ మ్యూజియంలను క్యాడెట్లు సందర్శించారు. స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా క్యాంపు పరిసరాలను శుభ్రం చేశారు. ఆల్ ఇండియా సైనిక్ కాంపిటీషన్ 2025 కోసం శిక్షణ అందజేశారు. బుధవారం బడా ఖానాతో ఈ క్యాంపు ముగిసింది. వివిధ పాఠశాలలు, కాలేజీల నుంచి వచ్చిన క్యాడెట్లు పాల్గొన్నారు.

శక్తి యాప్ డౌన్‌లోడ్‌కు స్పెషల్ డ్రైవ్




సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

గోపాలపట్నం: శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు గోపాలపట్నం పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దాన్ని ఏ విధంగా వాడాలో పౌరులకు వివరిస్తున్నారు. ఎక్కడైనా ఆకతాయిల వల్ల ఇబ్బందులు ఏర్పడితే వెంటనే ఈ యాప్‌ద్వారా సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం పలువురు ప్రయాణికుల చేత యాప్ డౌన్‌లోడ్ చేయించారు. గతంలో దిశా యాప్ ఉంటే అది ఇప్పుడు శక్తి యాప్‌గా ఆటోమేటిక్‌గా అప్‌డేట్ అయి శక్తి యాప్‌గా మారుతుందని తెలిపారు.

దివ్యాంగ బాలలను భవిత కేంద్రంలో చేర్చండి

ఆరిలోవ: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను (దివ్యాంగులు) భవిత కేంద్రంలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు చినగదిలి మండల ఎంఈవో అనురాధ సూచించారు. సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి చినగదిలి మండల పరిధిలో దివ్యాంగ పిల్లల సర్వే జరుగుతోంది. ఇందులో భాగంగా తోటగరువు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్ర టీచర్లతో కలిసి ఎంఈవో అనురాధ బుధవారం ఆరిలోవ ప్రాంతంలో సర్వే చేశారు. ముగ్గురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, భవిత కేంద్రంలో చేర్పించారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను గుర్తించే సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందన్నారు. భవిత సెంటర్‌లో అందిస్తున్న సేవలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారన్నారు. పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించి, వారి ప్రవర్తనలో మంచి మార్పు తీసుకొస్తారన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చేర్పించడానికి 83097 21261 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం టీచర్ షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బందికి నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమా దుర్గ టీమ్ నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎస్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక టీమ్, తృతీయ స్థానంలో సిహెచ్.జ్యోతికుమారి, మమత టీమ్‌లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను రిజిస్ట్రార్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అమానుషం

డాబాగార్డెన్స్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో దళితులపై నానాటికీ దాడులు పెచ్చుమీరుతున్నాయని, ఇది ఆగేదెప్పుడని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా ప్రశ్నించింది. దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జగదాంబ సమీపంలోని సిటు కార్యాలయంలో బుధవారం సంఘం జిల్లా కమిటీ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సుబ్బన్న, ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పలంపాడులో దళితులపై సాంఘిక బహిష్కరణ, తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను చిత్ర హింసలు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దళితుడని మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వమే అవమానిస్తే.. సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.